క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన ఆర్డీవో


ఎమ్మెల్యేకు మొక్క అందిస్తున్న రత్నకల్యాణి

ఖానాపూర్: ఇటీవల నిర్మల్ ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన రత్నకల్యాణి ఆదివారం ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి మొక్క అందజేశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. తహసీల్దార్ రాజమోహన్, బీఆర్ఎస్ నాయకులు కేహెచ్ ఖాన్ తదితరులు ఉన్నారు.

గౌడ సంఘం మండల కార్యవర్గం


అధ్యక్షుడు శంకర్

లోకేశ్వరం: మండల కేంద్రంలోని గౌడ సంఘ భవనంలో మండల కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌడ సంఘం మండలాధ్యక్షుడిగా గుడిసెల శంకర్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా భూమాగౌడ్, సురేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా స్వామిగౌడ్, కార్యదర్శిగా హరిగౌడ్, కోశాధికారిగా ముత్తగౌడ్, కార్యవర్గ సభ్యులుగా రాజాగౌడ్, రమాగౌడ్‌ను ఎన్నుకున్నారు.

కరపత్రం ఆవిష్కరణ

ముథోల్: విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ(భారత విద్యార్థి ఫెడరేషన్) తలపెట్టిన సమరభేరి జీపుజాత కరపత్రాలను ఆదివారం ముథోల్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమం ఆగస్టు 7న ఖానాపూర్‌లో ప్రారంభమై.. 11న ముథోల్‌లో ముగించనున్నట్లు ప్రతినిధులు తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గడ్పాలే పరమేష్, సభ్యుడు రుద్రప్రతాప్, శివ, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు

ముథోల్: మండల రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచామని పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎరువులు కావాల్సిన రైతులు తమ ఆధార్‌తో మండల కేంద్రంలోని కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. డీఏపీ బస్తా ధర రూ.1350, గ్రోమోర్ 20–20 రూ.1140, యూరియా రూ.267 ఉందన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

కుభీర్: మండలంలోని వాయి గ్రామంలో సిందే శంకర్‌కు చెందిన ఎద్దు మేతకు వెళ్లి ఇంటికి వస్తుండగా తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి మృతి చెందింది. ఎద్దు విలువ రూ.40వేలు ఉంటుందని యజమాని శంకర్ తెలిపారు. పశువైద్యాధికారి సర్వోత్తం పోస్టుమార్టం నిర్వహించారని.. ప్రభుత్వం తనకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని వేడుకున్నాడు.

కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజలు


ఆలయంలో భక్తుల పూజలు

సోన్: అధిక మాసం పురస్కరించుకొని ఆదివారం మండలంలోని సాకేర గ్రామ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బ్రాహ్మణ, ఆర్యవైశ్య జంటలకు వాయినం అందించి సన్మానం చేశారు. మహా అన్నదానం ప్రసాదం భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు అమేడి కిషన్, ముత్యం, సంతోష్ గుప్తా, చింతకుంట గంగాధర్, బొడ్డుకూరి సదానంద్, అర్చన, మల్లేశ్వరి పాల్గొన్నారు.

'అడెల్లి'లో అధికారుల పూజలు

సారంగాపూర్: మండలంలోని అడెల్లి మహాపోచమ్మ అమ్మవారిని ఆదివారం పబ్లిక్ ప్రాసిక్యూటర్ విశ్వాస్‌రెడ్డి, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, సీఐలు పురుషోత్తంచారి, శ్రీనివాస్, ఎంపీఐ హరీంద్రకుమార్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు అధికారులకు ఆలయ రెనోవేషన్ కమిటీ అధ్యక్షుడు ఆయిటి చందు, సీనియర్ అసిస్టెంట్ రమణారావు, సిబ్బంది ఘనస్వాగతం పలికారు. దర్శనం అనంతరం వారిని ఘనంగా సత్కరించారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

నిర్మల్‌టౌన్: పట్టణంలో దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మౌలానా ఆజాద్‌నగర్ ప్రాంతంలో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేసి ఆదివారం ఐదు నూతన స్తంభాలను ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది, కాలనీవాసులు ఉన్నారు.

ఏటా నష్టం.. అందని పరిహారం!

- భైంసా ముంపుకాలనీల్లో ఇబ్బందులు
- వరదతో రూ.లక్షల్లో నష్టపోతున్న పలువురు వ్యాపారులు
- పారిశుధ్య చర్యలు చేపట్టని అధికారులు
- శాశ్వత పరిష్కారం చూపాలని వినతి


బురదమయంగా వినాయక్‌నగర్‌లోని ఓ వీధి


ఇటీవల కురిసిన వర్షాలకు వినాయక్‌నగర్‌లో నీట మునిగిన దుకాణాలు

భైంసాటౌన్: భైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టు గేట్ల ద్వారా వచ్చే వరదతో ముంపునకు గురవుతున్నామని.. ఇళ్లు, దుకాణాల్లోకి నీరు చొచ్చుకురావడంతో ఏటా రూ.లక్షల్లో నష్టపోతున్నామని బాధితులు వాపోతున్నారు. భైంసా, లోకేశ్వరం మండలంలోని రైతుల పంటలకు నీరందించాలనే ఉద్దేశంతో గడ్డెన్నవాగు ప్రాజెక్టు నిర్మించిన విషయం తెలిసిందే. కానీ పంటలకు నీరు అందించడం మాటేమో గానీ.. గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదిలిన పలు సందర్భాల్లో భైంసా పట్టణంలోని భట్టిగల్లీ, వినాయక్‌నగర్, ఆటోనగర్, రాహుల్‌నగర్, భాగ్యలక్ష్మినగర్ తదితర ప్రాంతాల్లోకి వరద చేరుతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు పేర్కొంటున్నారు. ఇటీవల వరద ఇళ్లలోకి చేరడంతో ఎలక్ట్రానిక్ వస్తువులు చెడిపోయాయని.. పాములు, విషపురుగులు ఇళ్లలోకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

రూ.లక్షల్లో నష్టపోతున్న వ్యాపారులు...

గడ్డెన్నవాగు ప్రాజెక్టు దిగువన కుభీర్ చౌరస్తాలోని ఏఎంసీ దుకాణ సముదాయాలతోపాటు ఇతర దుకాణాలను వరద ముంచుతోంది. ఆటోనగర్ పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుంటుండడంతో దుకాణాల్లో రూ.లక్షల విలువైన సరుకంతా తడిసిపోతుంది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, లారీలు, ఇతర వాహనాలు నీటిలో మునిగి చెడిపోతున్నాయని వాపోతున్నారు.

పరిహారం అందించాలి..

వరదతో ఏటా సమస్య తలెత్తుతున్నా.. ముంపు ముప్పు తప్పించే చర్యలు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏటా రూ.లక్షల్లో నష్టపోతున్నా ప్రభుత్వం సర్వే జరిపి పరిహారం అందించిన దాఖలాలు లేవని ఆవేదన చెందుతున్నారు.


బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న మహిళ

కంపు కొడుతున్న కాలనీలు

భారీ వర్షాలకు భైంసాలో ఉన్న కుభీర్ చౌరస్తాలోని వినాయక్‌నగర్, గోకుల్‌నగర్, రాహుల్‌నగర్, భాగ్యలక్ష్మినగర్, ఆటోనగర్, తదితర ప్రాంతాల్లోని ఇళ్లల్లో నడుంలోతు వరకు వరద చేరింది. ప్రస్తుతం వర్షాలేకపోవడంతో వరద తగ్గుముఖం పట్టగా.. ఆయా కాలనీల్లో మాత్రం బురద మిగిలిపోయింది. దీంతో కాలనీవాసులు దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. పందులు సంచారం, దోమలు వృద్ధి చెంది వ్యాధుల ముప్పు పొంచి ఉందని ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు కాలనీల్లో రోడ్లపై బురద, వరదకు కొట్టుకొచ్చిన చెత్తాచెదారం తొలగించాలని పట్టణవాసులు వేడుకుంటున్నారు. వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ చల్లించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రూ.30లక్షల సరుకు తడిసింది


తడిసిన సరుకు చూపుతున్న స్వరూప్

గడ్డెన్నవాగు ప్రాజెక్టు వరద వినాయక్‌నగర్‌లోకి చొచ్చుకొచ్చింది. ఎన్నడూ లేనివిధంగా ఈసారి తీవ్ర నష్టం మిగిల్చింది. దుకాణంలో నడుంలోతు వరకు నీరు వచ్చింది. సుమారు రూ.30లక్షల సరుకంతా తడిసిపోయింది. మూడు గంటలు నీరు నిలవడంతో సరుకంతా చెడిపోయింది. ప్రభుత్వం నష్టపరిహారమిచ్చి ఆదుకోవాలి.

– స్వరూప్, వ్యాపారి, వినాయక్‌నగర్

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని సాగర్ కాలనీలో ఉన్న వృద్ధాశ్రమంలో ఆదివారం జిల్లా నిరుద్యోగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు లాండిగె సాయికృష్ణ, గొండ అజయ్, వరప్రసాద్, నికేతన్, శ్రీవాణి, కవిత పాల్గొన్నారు.

సదర్మాట్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

ఖానాపూర్: మండలంలోని మేడంపల్లి గ్రామంలోని సదర్మాట్ ప్రాజెక్ట్‌కు వరద ఉధృతి ఆదివారం కొనసాగింది. ప్రాజెక్ట్ గరిష్ట నీటిమట్టం 7.6 ఫీట్లు కాగా, ఆదివారం 8.6 ఫీట్లుగా ఉందని ఏఈఈ ఉదయ్ తెలిపారు. ఎగువన కురుస్తున్న వర్షాలతో భారీగా వరదనీరు వస్తోందన్నారు. 9,422 క్యూసెక్కుల నీరు గోదావరిలోకి వెళ్తోందని తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు


గాయపడిన శివాజీ

తానూరు: మండలంలోని బోల్సా ఎక్స్‌రోడ్డు సమీపంలో బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలయ్యాయి. ఎస్సై సందీప్ కథనం ప్రకారం.. బాసర మండలం లాబ్ది గ్రామానికి చెందిన సిందే శివాజీ పని నిమిత్తం వర్ఝరి(బి) గ్రామానికి ఆదివారం బైక్‌పై వెళ్తున్నాడు. బోల్సా సమీపంలో అదుపుతప్పి కిందపడిపోవడంతో ఆయనకు గాయాలయ్యాయి. ప్రయాణికులు, పోలీసులు చికిత్స నిమిత్తం భైంసా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మరమ్మతులు చేయిస్తున్న నాయకులు

కడెం: మండలంలోని ధర్మాజీపేట్–కుర్రగూడెం మధ్యలో ఉన్న వంతెన ఇటీవల వర్షాలకు కొట్టుకుపోయింది. ఆదివారం ధర్మాజీపేట్ గ్రామ సర్పంచ్ ఒర్సు వెంకటేశ్ తాత్కాలికంగా పైపులు ఏర్పాటు చేయించి దారి కష్టాలను తొలగించారు.

సాథ్‌గాం–పెండ్‌పల్లి రోడ్డుకు..

లోకేశ్వరం: భారీ వర్షాలకు మండలంలోని సాథ్‌గాం–పెండ్‌పల్లి రోడ్డు కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఆదివారం ఈ రోడ్డుకు మొరం పోసి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, బీఆర్ఎస్ నాయకులు సాయారెడ్డి, రత్నాకర్‌రావు, శ్యాంసుందర్, కపిల్, నర్సింగ్‌రావు, దిగంబర్, ప్రశాంత్ తదితరులున్నారు.


మరమ్మతులు చేయిస్తున్న సర్పంచ్ వెంకటేశ్


పనులు చేయిస్తున్న శ్యాంసుందర్

అర్లి వంతెన పనులు పరిశీలిస్తున్న ఈఈ..

లోకేశ్వరం మండలంలోని హావర్గ సమీపంలో ఉన్న అర్లి వంతెన ఇటీవల వరద ఉధృతికి దెబ్బతిన్న విషయం తెలిసిందే. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు రూ.12 లక్షల నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభమయ్యాయి. ఆదివారం పనులను ఆర్అండ్‌బీ ఈఈ అశోక్‌కుమార్ పర్యవేక్షించారు. ప్రస్తుతం అర్లి వంతెనపై నుంచి ద్విచక్ర వాహనాలను మాత్రమే అనుమతిస్తున్నారు. దీంతో మండల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వారి వెంట ఆర్అండ్‌బీ డీఈ కొండయ్య, ఏఈ రఘు తదితరులు ఉన్నారు.

70 కుటుంబాలకు సర్కారు అండ

భైంసారూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన మండలంలోని గుండేగాం గ్రామం కొంత నష్టపోయిన విషయం తెలిసిందే. గ్రామంలోని 70 కుటుంబాలకు ప్రభుత్వం సమకూర్చిన నిత్యావసర సరుకులను ఆదివారం రెవెన్యూ అధికారులు అందించారు. ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, రెండు లీటర్ల వంటనూనె, కిలో పంచదార, పావుకిలో టీ పొడర్, వంద గ్రాముల పసుపు, కారంపొడి 200 గ్రాములు, రెండు సంతూర్ సబ్బులు, రెండు ట్రిబుల్‌ఎక్స్ సబ్బులు, అరకిలో డిటర్జంట్ పౌడర్, షాంపులు–12, కిలో ఉప్పు, కిలో పెసరపప్పు, కిలో తొగరిపప్పు, వంద గ్రాముల జీలకర్ర అందించారు.


సరుకులను అందిస్తున్న డీటీ సూర్యప్రకాశ్

కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సూర్యప్రకాశ్, ఆర్ఐ కృష్ణాగౌడ్, రెవెన్యూ సిబ్బంది, నాయకులు చంద్రకాంత్ తదితరులు ఉన్నారు.

వాహనపత్రాలు కలిగి ఉండాలి

- కార్డన్‌సెర్చ్‌లో భైంసారూరల్ సీఐ నైలు

కుభీర్: వాహనదారులు అన్ని రకాల పత్రాలను వెంట ఉంచుకోవాలని భైంసారూరల్ సీఐ నైలు అన్నారు. ఆదివారం ఉదయం మండలంలోని పార్డి(బి) గ్రామంలో ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. ప్రజల భద్రత కోసమే కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అపరిచితులు, అనుమానితులుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు, భద్రత నిబంధనలు పాటించాలన్నారు. పత్రాలు సరిగా ఉంటేనే పాతవాహనాలు కొనుగోలు చేయాలన్నారు. తాగి బండ్లు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా సరైన పత్రాల్లేని 90 ద్విచక్రవాహనాలు, ఆటో, నాలుగు చక్రాల వాహనాన్ని స్వాధీనం చేసుకొని జరిమానాలు విధించారు. కుభీర్ ఎండీ. షరీఫ్‌తోపాటు పలువురు ఎస్సైలు, 40 మంది కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐ నైలు

వరద బాధితులను ఆదుకోండి

భైంసా: భారీ వర్షాలతో నష్టపోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామారావుపటేల్ డిమాండ్ చేశారు. ఆదివారం బాసర మండలం టాక్లీ, లాబ్దితోపాటు పలు గ్రామాల్లో పర్యటించారు. వర్షాలు, వరదలతో దెబ్బతిన్న పంటలు, రోడ్లను పరిశీలించారు. బాధిత రైతులను కలిసి ఓదార్చారు.

లోకేశ్వరం:గడ్డెన్నవాగు ప్రాజెక్టు వదర ఉధృతికి దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించే వరకు పోరాటం చేస్తామని బీజేపీ నాయకులు మోహన్‌రావుపటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని పుస్పూర్, హావర్గ, మన్మద్ తదితర గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటలను బీజేపీ నాయకులు పరిశీలించారు. సుభాశ్‌పటేల్, నారాయణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు చర్యలు చేపట్టకనే వరదలు..

ఖానాపూర్: పాలకులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతోనే ఏటా వర్షాకాలంలో నియోజకవర్గ ప్రాంత ప్రజలకు ముప్పు వాటిల్లుతుందని బీజేపీ నాయకులు, ఆదిలాబాద్ మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని జేకేనగర్, రాజీవ్‌నగర్ తదితర ప్రాంతాలో వరదలతో నష్టపోయిన బాధితులను పరామర్శించారు. ఖానాపూర్, కడెం మండలాల ఆయకట్టు రైతులకు సదర్మాట్ ద్వారా నీటిని అందించడంలో పాలకులు విఫలం అవుతున్నారని పేర్కొన్నారు. సదర్మాట్ కాల్వకు గండిపడిన ప్రాంతాలను సందర్శించారు. కెనాల్‌కు గండి పడినా స్థానిక ఎమ్మెల్యే నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టేకు ప్రకాష్, నాయిని సంతోష్, అనిల్‌రావు, ఆకుల శ్రీనివాస్, తోకల బుచ్చన్న, డి.మల్లయ్య, మహేందర్, ఆనంద్, భూమన్న, రాజేందర్, రవి, శ్రీనివాస్‌గౌడ్, సాయి తదితరులు ఉన్నారు.


మన్మద్‌లో పరిశీలిస్తున్న మోహన్‌రావుపటేల్


గండిపడ్డ కాలువ పరిశీలిస్తున్న రమేశ్ రాథోడ్

రైతులకు పరిహారం చెల్లించండి

నిర్మల్‌చైన్‌గేట్: నియోజకవర్గంలో పంట నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తొమ్మిదేళ్లుగా పంట నష్టపోతున్న ఒక్క రైతుకూ తెలంగాణ ప్రభుత్వం పరిహారం అందించలేదని ఆరోపించారు. రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి బాధిత రైతులను పరామర్శించకుండా పార్టీ కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించడం సిగ్గుచేటన్నారు. మంత్రి అనాలోచిత నిర్ణయాలతో పట్టణ సుందరీకరణ పేరిట నాలాలను ధ్వంసం చేసి వాటిపైనే ఫుట్‌పాత్‌లు నిర్మించి విధ్వంసం చేశారని ఆరోపించారు. చిన్నపాటి వర్షానికే పట్టణం మునిగి పాలకుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనంగా నిలిచిందని దుయ్యబట్టారు. కాళేశ్వరం పేరిట రూ.లక్ష కోట్లు ఖర్చు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి కడెం, స్వర్ణ ప్రాజెక్ట్‌లు కనబడడం లేదా? అని ప్రశ్నించారు. కనీసం మరమ్మతులకు నిధులు కూడా మంజూరు చేయడం లేదని ఆరోపించారు. పంట నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం చెల్లించకుంటే పార్టీ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్, ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు మెడిసెమ్మ రాజు, సామ రాజేశ్వర్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వొడిసెల అర్జున్, నాయకులు నారాయణ్‌రెడ్డి, బాపురెడ్డి తదితరులున్నారు.


మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

బీజేపీలో పలువురి చేరిక

సోన్: మండలంలోని సిద్దులకుంట గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆదివారం జిల్లా కేంద్రంలోని ఏలేటి మహేశ్వర్ నివాసంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి.. ముత్యంరెడ్డి, సంతోశ్‌రెడ్డితో పాటు పలువురు యువకులకు బీజేపీ కుండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏలేటి మాట్లాడుతూ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి భూకబ్జాలు, అక్రమాలకు పాల్పడ్డారని.. ఈ అవినీతి పాలనను అరికట్టేందుకు నిర్మల్ గడ్డపై బీజేపీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. రావుల రాంనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి, సరికెల గంగన్న, బర్ల హరీశ్‌రెడ్డి, గంగారెడ్డి, సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, భూమేశ్ తదితరులున్నారు.

నేటి నుంచి ప్రత్యేక పారిశుధ్య పనులు

నిర్మల్‌చైన్‌గేట్: కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమ, మంగళవారాల్లో జిల్లాలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టనున్నట్లు డీఎంహెచ్‌వో ధనరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. పనుల పర్యవేక్షణకు మండలానికో జిల్లాస్థాయి ప్రత్యేకాధికారిని కలెక్టర్ నియమించారని పేర్కొన్నారు. మండల స్థాయిలోనూ సమన్వయ కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైద్యారోగ్య, పంచాయతీరాజ్, మున్సిపల్, శిశు సంక్షేమ, రెవెన్యూ శాఖల సిబ్బంది సమన్వయంతో పకడ్బందీగా పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ ఇంటితోపాటు పరిసరాలను పరిశీలించి నిల్వ నీటిని తొలగించనున్నట్లు తెలిపారు. ప్రజలకు పారిశుధ్య నిర్వహణపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వరద ప్రభావిత గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఆర్బీఎస్‌కే బృందంతో రెసిడెన్షియల్ పాఠశాలల వసతిగృహాల్లో విద్యార్థులను పరీక్షించనున్నట్లు తెలిపారు.

ఐడీసీ చైర్మన్‌కు వినతి

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేయించి చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఐడీసీ చెర్మన్ వేణుగోపాలచారికి వినతిపత్రం అందజేశారు. ఆదివారం భైంసాలో చైర్మన్‌ను మండలంలోని మన్మద్ గ్రామస్తులు కలిసి పలు సమస్యలు విన్నవించారు. ఎత్తిపోతల పథకానికి మన్మద్ సబ్‌స్టేషన్ నుంచి కరెంట్ సరఫరా చేయాలన్నారు. హావర్గ సరిహద్దు ప్రాంతంలో సుద్దవాగుపై చెక్‌డ్యాం నిర్మిస్తే నర్సాపూర్(జి) మండలంలోని అర్లి, డోంగూర్‌గాం, మన్మద్ ఎత్తిపోతల పథకాలకు నీరందుతుందని పేర్కొన్నారు. వినతి పత్రం అందించిన వారిలో సర్పంచ్ శేఖర్‌రెడ్డి, వీడీసీ చెర్మన్ రాజలింగు, గంగాకిషన్, గన్ను నర్సారెడ్డి, భోజారెడ్డి ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి


కడెంలో మాట్లాడుతున్న వినోద్‌నాయక్


బాసరలో వంటావార్పులో పాల్గొన్న కార్మికులు

కడెం: 25రోజులుగా సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికుల సమస్యలను బీఆర్ఎస్ ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐసీసీ రిసెర్చ్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్‌నాయక్ అన్నారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులకు మద్దతు పలికారు. అనంతరం కార్మికులకు భోజనం సమాకూర్చారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లేశ్, రఫీక్, భూషణం, సలీం, బబ్లూ, తదితరులు ఉన్నారు.

భైంసా: తమ సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం నాటికి 25వ రోజుకు చేరింది. బాసరలో కార్మికులు వంటావార్పు చేసి నిరసన వ్యక్తం చేశారు.

ఖానాపూర్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు రిలే నిరాహారదీక్షలో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు. తమను రెగ్యులరైజ్ చేసి కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. చంద్రశేఖర్, నాగరాజు, పోశెట్టి, స్వామి తదితరులు ఉన్నారు.

రోడ్లపై కేజీవీల్స్ నడిపితే చర్యలు

సారంగపూర్: కేజీవీల్స్‌తో కూడిన ట్రాక్టర్లకు పట్టీలు బిగించకుండా రోడ్లపై తిప్పితే చర్యలు తప్పవని ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గ్రామాల్లో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. యాకర్‌పెల్లిలో ఓ ట్రాక్టరు యజమాని కేజ్‌వీల్స్‌కు పట్టీలు బిగించడంతో ఆయనను అభినందించారు. యజమానులు నిబంధనలు పాటించకుంటే కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామన్నారు.

కష్టపడి చదివితేనే భవిష్యత్తు

కుంటాల: కష్టపడి చదివితేనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంపీపీ అప్క గజ్జారాంయాదవ్ పేర్కొన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదివిన లహరి, వైష్ణవి, శిరీష, హష్మిత, భరద్వాజ్, రోహిత్, జశ్వంత్, హరిదాస్, సూరజ్ ఇటీవల బాసర ట్రిపుల్‌ఐటీకి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం కుంటాలలో విద్యార్థులను సన్మానించి మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు గంగయ్య, తాటి శివ, గజేందర్, గంగయ్య, దనగరి సాయన్న, ప్రణయ్‌రావు, రాజు, దశరథ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

కడెం: రైతు సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వమ ధ్యేయమని ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు బాదవత్ పూర్ణచందర్‌నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని దోస్తనగర్ గ్రామంలో పర్యటించారు. కూలీలతో కలిసి వరినాట్లు వేశారు. రైతులకు రైతుబీమా, రైతుబంధు పథకాలతో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. అనంతరం కడెంకు చెందిన ఫరీద్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా మృతదేహానికి నివాళ్లరించి.. కుటుంబసభ్యులను పరామర్శించారు. వారి వెంట పూర్ణ యువసేన నాయకులు తదితరులు ఉన్నారు.

డ్రెయినేజీల్లో పూడికతీత

ఖానాపూర్: పట్టణంలోని 11వవార్డు పరిధిలో ఉన్న జేకేనగర్‌లో ఆదివారం ముమ్మరంగా పూడికతీత పనులు చేపట్టారు. కౌన్సిలర్ చిన్నం సత్యం ఆధ్వర్యంలో పొక్లెయిన్‌తో తొలగించారు. పలుచోట్ల ఓపెన్ డ్రెయినేజీలను ఏర్పాటు చేసినట్లు కౌన్సిలర్ తెలిపారు. కాలనీవాసులు ఉన్నారు.

అన్నదానం

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ పంచాయతీలోని గంగాయిపేట్‌లో ఆదివారం అన్నదానం నిర్వహించారు. లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబురావు తన పుట్టినరోజు పురస్కరించుకొని అన్నదానం చేశారు. సన్నిత్, వెంకటేశ్వర్లు, రాంచందర్ ఉన్నారు.